లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా చొరవ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 16న నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎక్కువ కేసులు పరిష్కరించేలా పోలీస్ సిబ్బంది చొరవ చూపాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్రణాళికతో పనిచేసి లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా కోర్టు కానిస్టేబుళ్లు, మానిటరింగ్ సెల్ సిబ్బంది చొరవ చూపాలని సూచించారు. రాజీపడే కేసుల్లో ఉభయ పక్షాలను ప్రవేశపెట్టడం వల్ల ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. డీసీఆర్‌బీ సీఐ లక్ష్మణమూర్తి, ఎస్సైలు రామారావు, జిల్లాలోని కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

డీఎస్పీ సుబ్బరాజు బదిలీ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజుకు బదిలీ అయ్యింది. విజయవాడ ఏసీబీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో విశాఖ నగర ఇంటిలెజెన్స్ డీఎస్పీ ఎస్.అప్పలరాజును నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సుబ్బరాజు గత ఏడాది ఏప్రిల్ 29న విధుల్లో చేరారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన్ను ఇక్కడ్నుంచి బదిలీ చేశారు.

చెబితే.. అంతేనన్న 'మాట'

హామీ ఇచ్చి పంచగ్రామాల సమస్య పట్టించుకోని జగన్!

కమిటీలతో వైకాపా ప్రభుత్వ కాలయాపన



'పంచగ్రామాల సమస్యకు త్వరలోనే పరిష్కారం దొరుకుతుంది. తగిన న్యాయం చేస్తాం'

అని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు.

రెండేళ్లు గడిచినా అమలుకు నోచుకోలేదు. పంచగ్రామాల సమస్యపై మొదటి శాసనసభా సమావేశంలోనే వైకాపా ప్రభుత్వం సలహా కమిటీ ఏర్పాటు చేసింది. గడువులోగా పరిష్కరించాలని నిర్ణయించింది. ఆ తర్వాత పలు కమిటీలతో కాలయాపన చేసిందే తప్ప ఈ అంశాన్ని తీవ్రంగా తీసుకోలేదు. –ఈనాడు, విశాఖపట్నం

సింహాచలం దేవస్థానానికి వేల ఎకరాల్లో భూములున్నాయి. ముఖ్యంగా పంచగ్రామాలైన అడవివరం, వేపగుంట, వెంకటాపురం, పురుషోత్తపురం, చీమలాపల్లిలోని భూముల్లో అధిక సంఖ్యలో నిర్మాణాలు వెలిశాయి. వీటి క్రమబద్ధీకరణలో వైకాపా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొద్ది రోజుల ముందు దేవాదాయశాఖ మంత్రి తూతూ మంత్రంగా సమీక్ష జరిపి మమ అనిపించారు.

గత ప్రభుత్వ హయాంలో..

దేవస్థానం భూముల్లో నిర్మించిన కట్టడాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు అనుమతిస్తూ తెదేపా ప్రభుత్వం 2019లో ప్రకటన ఇవ్వడమే కాకుండా గెజిట్ సైతం జారీ చేసింది. ఇందుకు దేవాదాయశాఖ చట్ట సవరణ చేశారు. ఫలితంగా ఆక్రమణదారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధరలను సైతం అప్పటి కలెక్టర్ నిర్ణయించారు. ఆ సమయంలో మొత్తం 12,149 నిర్మాణాలను క్రమబద్ధీకరణకు గుర్తించారు. వంద గజాల్లోపున్న పేదలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. వైకాపా నేతలు మాత్రం అయిదేళ్ల నుంచి ఈ భూసమస్యకు సంబంధించిన కేసు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పుకుంటూ వచ్చారే తప్ప చేయలేదు.

చేసిందింతే.. సలహా కమిటీలోని సభ్యులను ఎప్పటికప్పుడు మార్చారే తప్ప సమస్యను కొలిక్కి తీసుకురాలేదు. మొదట దేవాదాయశాఖ మంత్రి ఛైర్మన్‌గా భీమిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారులు, కలెక్టరు, దేవస్థానం ఈవోను సభ్యులుగా నియమించారు. ఆ కమిటీ ఒకసారే సమావేశమైంది. రెండో ఏడాది ఆ కమిటీలోకి ఎంపీలు విజయసాయిరెడ్డి, సత్యవతిలను కొత్త సభ్యులుగా చేర్చారు.

▼ గత ఏడాది ఫిబ్రవరిలో మరోసారి మార్పులు చేసి దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఛైర్మన్‌గా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు విజయసాయిరెడ్డి, సత్యవతిలను కొనసాగిస్తూ సీఎం ముఖ్య సలహాదారు, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్, ఈవోలను సభ్యులుగా చేర్చారు. అప్పట్లో స్థానిక ఎమ్మెల్యేలను చేర్చకపోవడం చర్చనీయాంశమవ్వడంతో వారినీ చేర్చారు. ఇలా మార్చారే తప్ప ప్రజల బాధలు మాత్రం పట్టించుకోకపోవడం దారుణమనే విమర్శలొస్తున్నాయి.

పైచేయి... అలలదే!!

'ఫ్లోటింగ్ బ్రిడ్జి'కి కెరటాల పోటు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ ఆర్‌కే బీచ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి శనివారం మధ్యాహ్నం చెల్లాచెదురవడం మళ్లీ కలకలం రేపింది. ఈ వంతెనను గత నెల 25న విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో వైకాపా నేతల సమక్షంలో ప్రారంభించారు. అనంతరం ఒక్క రోజులోనే 'టి జాయింట్' విడిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అధికారులు మాత్రం అలలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో మాక్ డ్రిల్ నిర్వహించి ఆ జాయింట్‌ను దూరంగా తీసుకువెళ్లి లంగరు వేశామని చెప్పుకొచ్చారు. అప్పటి నుంచి సందర్శకులను అనుమతించకుండా పరిశీలన కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయిలో సన్నద్ధత అయ్యాకే పర్యాటకులను అనుమతిస్తామని అధికారులు తేల్చారు. దీంతో కొందరు నిపుణులను రప్పించి లోపాలు తలెత్తకుండా ఎలా నిర్వహించాలనే దానిపై కసరత్తు చేస్తున్నారు.

డబ్బాలు విడిపోయి: అలల ధాటికి టీ జాయింట్ చెల్లాచెదురవగా నిర్వాహకులు దాన్ని అనుసంధానం చేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. కొన్ని డబ్బాలు విడిపోయి బయటకు వచ్చేశాయి. దీంతో వాటిని పూర్తిగా బయటకు తీసి టీ జాయింట్‌పై ఉంచినట్లు తెలుస్తోంది. 'టీ జాయింట్' ఒకానొక సమయంలో నీటిలో మునిగిపోయినంత పరిస్థితి తలెత్తింది. కొంత సమయానికి తీరం వైపు తీసుకొచ్చినా ఒరిగిపోయి కనిపించడంతో చూసిన వారు ఆందోళన వ్యక్తం చేశారు. వంతెనకు అనుసంధానంగా ఉన్న డబ్బాలు కొన్ని దెబ్బతిని ఒక వైపునకు ఒరిగిపోయి కనిపించింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అలలు వంతెన మీద నుంచి మూడు, నాలుగు అడుగుల ఎత్తున ఎగిసిపడ్డాయి. దీంతో అసలు ఇక్కడ ఏర్పాటు చేయడం అనుకూలమేనా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 'నిపుణుల పర్యవేక్షణలో పరిశీలన కొనసాగుతోంది. ఈ క్రమంలో టీ జాయింట్ విడిపోయింది. అన్ని స్థాయిలో పరిశీలన సమగ్రంగా అయ్యాకే సందర్శకులను అనుమతించాలని కలెక్టర్ స్పష్టం చేశారు' అని అధికారులు వివరించారు.

అనకాపల్లిలో కేంద్ర బలగాల కవాతు

నిర్భయంగా ఓటు వేయండి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికల నేపథ్యంలో నిర్భయంగా ఓటేసేలా భరోసా కల్పిస్తూ కేంద్ర పోలీసు బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సనత్‌కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ అమిత్‌కుమార్, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కవాతు జరిగింది. పెరుగుబజార్, రింగురోడ్డు, పార్కు సెంటర్, సంతోషి మాతగుడి, దిబ్బవీధి, అగ్గిమర్రిచెట్టు, ఎన్టీఆర్ ఆసుపత్రి మీదుగా ఎన్టీఆర్ క్రీడా మైదానం వరకు కవాతు సాగింది. సీఐ శంకరరావు, ఎస్సైలు మహ్మద్ అలీ షరీఫ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సరకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

విశాఖపట్నం: సరకు రవాణాలో విశాఖ పోర్టు అథారిటీ నూతన అధ్యాయాన్ని లిఖించిందని ఛైర్మన్ అంగముత్తు తెలిపారు. 1933లో ఏర్పడిన పోర్టు ఈ ఏడాది 90 ఏళ్లను పూర్తి చేసుకుందన్నారు. 2023-24 మార్చి 2 నాటికి 73.78 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకును రవాణా చేసిందన్నారు. 2022-23లో సాధించిన 73.73 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించిందన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధితో ఉపాధి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధితో నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. కోడూరు ఆటోనగర్‌లో ఎంఎస్ఎంఈ పార్కు, కలెక్టర్ బంగ్లాను శనివారం ఎంపీ సత్యవతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 130 ఎకరాల్లో ఈ పార్కు ఉందని, పరిశ్రమల్లో 50 వేల మందికి ఉపాధి కల్పించామన్నారు. పరిశ్రమలు వస్తే మరింత మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ఈ పార్కులో మహిళలకు ప్రత్యేక యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్ రవితో కలిసి కలెక్టర్ బంగ్లాను ప్రారంభించారు. ఎంపీపీ సూరిబాబు, సర్పంచి సేనాపతి లక్ష్మీ, ఏపీఐఐసీ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) నాయకులు శనివారం ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు బకాయిలు చెల్లించలేదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని ఆ వినతిలో పేర్కొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రూపొందించిన కరపత్రాలను ఎంపీ ఆవిష్కరించారు. త్వరలోనే ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీ హామీ ఇచ్చారని తెలిపారు. కోశాధికారి రాజేష్, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకటఅప్పారావు, హేమకుమారి, ప్రకాష్ పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి తదితరులు

110 కేజీల గంజాయి పట్టివేత

రావికమతం, న్యూస్‌టుడే: తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న ముఠాను రావికమతం పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠాతో సంబంధాలున్న స్థానిక స్వీట్ స్టాల్ నిర్వాహకుడు గంజి సత్తిబాబు సహా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. 110 కేజీల గంజాయి, రూ. 1.03 లక్షల నగదు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు కొత్తకోట సీఐ అప్పలనాయుడు శనివారం వెల్లడించారు. రావికమతం మెయిన్ రోడ్డు కూడలిలో గెంజి సత్తిబాబు స్వీట్ స్టాల్ నిర్వహిస్తున్నాడు. వి.మాడుగుల మండలం తిరువాడ గ్రామం నుంచి రంపపు పొట్టుతో కలిపి గుట్టుగా గంజాయిని ఇక్కడకు తీసుకువస్తున్నాడు. ఇంట్లో ప్యాకింగ్ చేసి తమిళనాడుకు చెందిన ముఠాకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అతడి కదలికలపై నిఘా పెట్టారు. శుక్రవారం సాయంత్రం రంపపు పొట్టుతో తీసుకొచ్చిన గంజాయిని రెండు కేజీల చొప్పున ప్యాకింగ్ చేస్తుండగా ఎస్సై ధనుంజయనాయుడు సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. సత్తిబాబు సెల్‌ఫోన్‌లోని సమాచారం ఆధారంగా వివిధ ప్రాంతాలకు చెందిన 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు. నిందితుల్లో సత్తిబాబుతో పాటు జెట్టి శంకర్, వి.మాడుగుల మండలం సత్యవరానికి చెందిన గోకాడ యేసుబాబు, సాగరం గ్రామానికి చెందిన వంజల నాగరాజు, తిరువాడకు చెందిన జుట్టా రాము, ఎలమంచిలి మండలం పెదగొల్లలపాలెంకు చెందిన కోన అప్పలనాయుడు, చెన్నైలోని కోయంబేడు ప్రాంతానికి చెందిన సబాబతి గణేశన్, కోదండరామ్ రూపేష్ ఉన్నారన్నారు. వీరిని శనివారం చోడవరం కోర్టుకు హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఏఎస్సై అప్పారావు, హెచ్‌సీ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో సీఐ అప్పలనాయుడు, ఎస్సై ధనుంజయనాయుడు, సిబ్బంది

రూ. 1.03 లక్షల నగదు స్వాధీనం..

ఎనిమిది మంది అరెస్టు

నర్సీపట్నంలో కొనుగోలు.. తెలంగాణలో విక్రయం

ఖమ్మం, న్యూస్‌టుడే: గంజాయి రవాణా, విక్రయాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఖానాపురం హవేలి పోలీసు స్టేషన్ పరిధిలో జరిపి తనిఖీల్లో రూ.లక్ష విలువైన 4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు విక్రయదారులు, ఏడుగురు కొనుగోలుదారులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఖమ్మం టౌన్ ఏసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. నగర శివారు చెరుకూరి వారి మామిడితోట సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన రాజమండ్రికి చెందిన తారపరెడ్డి మణికుమార్ (బన్ను), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం అనంతారానికి చెందిన మాలోతు లోకేశ్ నాయక్, ఖమ్మం నగరం ఇందిరా నగర్‌కు చెందిన షేక్ అహ్మద్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారని, నగరంలోని 20 మంది వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. నిందితుల నుంచి రూ.లక్ష విలువైన 4 కిలోల గంజాయి, కారు, ద్విచక్ర వాహనం, ఒక ఐపాడ్, ఏడు చరవాణులు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు అందించిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టి గంజాయి వినియోగిస్తున్న 20 మందిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని, వీరి నుంచి 20 చిన్న ప్యాకెట్ల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన వారు పరారీలో ఉన్నారన్నారు. ఏసీపీ రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు భానుప్రకాశ్, రమేశ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంకన్నకు పూజలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: మాఘ శనివారం సందర్భంగా ఉపమాక వెంకన్నకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం కొండపై అర్చకులు నిజరూపంతోపాటు ఉత్సవమూర్తులకు అభిషేకం, నిత్య ఆరాధన తదితర పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి అనకాపల్లి, విశాఖ, కాకినాడ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కోలాహలంగా మారింది. దీంతో మధ్యాహ్నం వరకు ఆలయంలో రద్దీ కొనసాగింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకున్న మండల వైకాపా అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి మండలానికి చెందిన పార్టీ శ్రేణులు తదితరులతో ఆలయానికి చేరుకుని స్వామివారికి మొక్కులు చెల్లించారు.

పూజలు చేస్తున్న అర్చకుడు

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ వెంకటలక్ష్మమ్మ కోరారు. అచ్యుతాపురం ఉన్నత పాఠశాలను ఆమె శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులను ఒత్తిడికి గురిచేయకుండా చదివించాలన్నారు. పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం అవుతున్నారో తెలుసుకున్నారు. ఐఎఫ్‌పీ ప్యానెల్ వినియోగంపై ఆరా తీశారు. టోఫెల్ బోధనకు సిద్ధం కావాలన్నారు. విద్యార్థులు మంచి ఆహారం తీసుకొని పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకంపై ఆరా తీశారు. విద్యార్థుల్లో రక్తహీనతపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయిని పద్మావతి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ



రైతుకు ధ్రువపత్రం అందిస్తున్న ఏడీఆర్

సేంద్రియ సాగు లాభదాయకం: ఏడీఆర్

అనకాపల్లి, న్యూస్‌టుడే: చెరకులో సేంద్రియ సాగు లాభదాయకమని పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. వారం రోజులుగా జిల్లాలో ఎంపిక చేసిన రైతులకు 'చెరకు సాగులో సేంద్రియ ఎరువుల పాత్ర' అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులకు ధ్రువపత్రాలు అందజేశారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టరు ఆశాదేవి మాట్లాడుతూ చెరకు సాగులో ఖర్చులు తగ్గించుకోవాలని, యాంత్రీకరణ చేపట్టాలన్నారు. శాస్త్రవేత్తలు డాక్టరు రమణమూర్తి, విశాలాక్షి, సీతారామలక్ష్మి, శ్రీదేవి, శిరీష, ఉమామహేశ్వరరావు మాట్లాడారు.

విజయనగరంలో దొంగనోట్ల కలకలం

రూ.15 లక్షల నకిలీ నగదు స్వాధీనం

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా కేంద్రంలో దొంగనోట్ల ముఠా గుట్టు రట్టయింది. రూ.15 లక్షల నకిలీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు పరారవగా, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ గోవిందరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. విజయనగరానికి చెందిన బి. చక్రధర్, దత్తిరాజేరు మండల వాసి ఆర్. విష్ణుపై అత్యాచారం, కొట్లాట, దొంగనోట్ల చలామణి తదితర కేసులున్నాయి. ఇప్పటికే పలుమార్లు జైళ్లకు వెళ్లారు. ఈక్రమంలో వీరికి ఒడిశాకు చెందిన చంద్రమణిబాల్‌తో పరిచయం ఏర్పడింది. ఇతనిపై కూడా గజపతినగరం, విశాఖ పరిధిలోని స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ముగ్గురి మధ్య ఏర్పడిన పరిచయం కాస్తా స్నేహంగా మారింది. ఎక్కువగా డబ్బులు సంపాదించాలని భావించారు. ఈక్రమంలో దొంగనోట్లను మార్చాలని నిర్ణయించుకున్నారు. జైలు నుంచి బయటకు వచ్చాక చక్రధర్, విష్ణు కలిసి రూ.15.50 లక్షల నకిలీ నోట్లు తీసుకుని, చంద్రమణిబాల్‌కు రూ.3 లక్షలిచ్చారు. ఇప్పటికే నగరంలో రూ.50 వేల నోట్లను పంపిణీ చేసేశారు. శనివారం గుమ్మీ రోడ్డులో మరికొందరికి ఇస్తుండగా రెండో పట్టణ సీఐ కె.రామారావు, ఎస్సై దుర్గాప్రసాద్ తన బృందంతో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనున్న రూ.50 వేలు, చక్రధర్ ఇంట్లోని మరో రూ.14.50 లక్షల విలువైన నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని, డీఎస్పీ చెప్పారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు సాగుతోందన్నారు.

SOUTH INDIAN Bank

ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ ప్రాంతీయ కార్యాలయము, హైదరాబాద్
నెం.157/6, మొదటి అంతస్తు, CHAI కాంప్లెక్స్, స్టాఫ్ రోడ్, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, సిఖ్ విలేజ్, డైమండ్ పాయింట్, సికింద్రాబాద్-500009.

REF: RO-HYD/REC/0450/2023-24 తేది: 02.03.2024

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1)కు గల నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం అమ్మకం ప్రకటన.

రుణగ్రహీత: 1.శ్రీమతి వెంకట నూక నాగరత్నం కోటోజు (ప్రొప్రైటర్ – మెసర్స్ శ్రీ లక్ష్మీ గణపతి ఇండస్ట్రీ), సర్వే నెం.11/1, బొలువాడ గ్రామం, అనకాపల్లి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-531001. గ్యారంటరు: **2.శ్రీ శ్రీనివాస్ రావు కట్టోజు,** డోర్ నెం.10-1-104, పిల్ల వారి వీధి, ఫిష్ మార్కెట్ సమీపాన, అనకాపల్లి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-531001. **3.శ్రీమతి ద్వారపూడి లక్ష్మి,** డోర్ నెం.12-4-1/13, సత్యసాయి మార్గ్, ఆర్‌టిసి కాంప్లెక్స్, అనకాపల్లి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-531001.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత/ గ్యారంటరు/ న్యాయవారసులకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్, గాజువాక శాఖ (సెక్యూర్డ్ క్రెడిటార్)కి తనఖా పెట్టబడిన మరియు ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) యొక్క అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనపర్చుకోబడిన దిగువ వివరించబడిన స్థిరాస్తి, ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్, గాజువాక శాఖ (సెక్యూర్డ్ క్రెడిటార్)కి 01.03.2024 నాటికి **మెసర్స్ శ్రీ లక్ష్మీ గణపతి ఇండస్ట్రీ** ఖాతాలో రుణ సదుపాయాలకు సంబంధించి బకాయిపడిన మొత్తం **రూ. 1,95,54,812.51 (ఒక కోటి తొంభై ఐదు లక్షల యాభై నాలుగు వేల ఎనిమిది వందల పన్నెండు రూపాయల యాభై ఒక్క పైసలు మాత్రమే)** మరియు దానిపై భవిష్యత్ వడ్డీ, వ్యయాలు మరియు ఖర్చులు వగైరాలను పైన తెలిపిన రుణగ్రహీత(ల), గ్యారంటర్ల నుండి రాబట్టుకునేందుకు **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే" ప్రాతిపదికన 30.03.2024న** విక్రయించబడుతుంది.

ఆస్తి యజమాని పేరు: **శ్రీమతి ద్వారపూడి లక్ష్మి**

ఆస్తి వివరం: అనకాపల్లి సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో రిజిస్ట్రర్ అయిన రెండు సేల్ డీడ్ నెం.లు అనగా సేల్ డీడ్ నెం.2239/1982, తేది: 14.04.1982 మరియు సేల్ డీడ్ నెం.1344/1989, తేది: 22.04.1989లలో మరింత పూర్తిగా వివరించిన, ద్వారపూడి లక్ష్మి యజమానిగా ఉన్న మరియు విశాఖపట్నం జిల్లా, యేటిఅవతలఖండం, అనకాపల్లి గ్రామం మరియు తాలూకాలోని సర్వే నెం.20/2, 43/1లో గల దానిపై ప్రస్తుతం ఉన్న అన్ని ఇతర కట్టడాలు, అభివృద్ధి పనులు, అనుభోగ హక్కులు మరియు అనుబంధాలతోపాటు 3225 చ.అడుగులు (సుమారుగా) విస్తీర్ణపు బిల్టప్ ఏరియాతో అనకాపల్లి మున్సిపాలిటీలోని డోర్ నెం.12-4-8 (10) మరియు ఫ్లాట్ నెం. 1 & 2 గల నివాస భవనంతో 486 చ.గజాల (242 చ.గజాలు + 244 చ.గజాలు) విస్తీర్ణ భూమి యావత్తు. **సరిహద్దులు:** ఉత్తరం: వెడుల పీపుల్ ఆస్తి, దక్షిణం: రోడ్, తూర్పు: బోడ అప్పారావు ఆస్తి, పడమర: పంట కాలువ.

రిజర్వు ధర	రూ.1,79,42,000/– (ఒక కోటి డెబ్బై తొమ్మిది లక్షల నలభై రెండు వేల రూపాయలు మాత్రమే)
ధరావతు (EMD)	రూ.17,94,200/– (పదిహేడు లక్షల తొంభై నాలుగు వేల రెండు వందల రూపాయలు మాత్రమే)
ధరావతును చెల్లించవల్సినది	29.03.2024 సా.5.00 గం.కు లేదా అలోగా
బిడ్ పెంపుదల మొత్తం	రూ.1,00,000/– (ఒక లక్ష రూపాయలు మాత్రమే)
వేలం తేది మరియు సమయం	30.03.2024 మ.12.30 గం.నుండి మ.1.30 గం.వరకు (అమ్మకం ముగిసేంతవరకు 5 నిమిషాల ఆపరిమిత ఆటో ఎక్స్‌టెన్షన్స్‌తో)
బ్యాంకుకు తెలిసిన ఎన్కంబెన్సులు	లేవు

వివరమైన అమ్మకం నియమనిబంధనల కొరకు ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) యొక్క వెబ్ పోర్టల్ అనగా www.southindianbank.com నందు ఇవ్వబడిన లింక్‌ను చూడండి. వివరాలు https://bankauctions.inలో కూడా అబ్బిస్తాయి. ఆస్తి తనిఖీ, ఇ-వేలం నియమ నిబంధనలు లేదా బిడ్స్ దాఖలుకి సంబంధించిన ఏవేని తదుపరి స్పష్టీకరణల కొరకు సౌత్ ఇండియా బ్యాంక్ లిమిటెడ్‌ను 09789376300/ 09000297130పై సంప్రదించవచ్చును.

తేది: 02.03.2024 అధీకృత అధికారి
ప్రదేశం:హైదరాబాద్ (చీఫ్ మేనేజర్)

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

**7 కేసుల్లో 21 తులాల బంగారు